క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి



సంగీత కచేరీ నిర్వహిస్తున్న పరిమి సావిత్రి బృందం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు ఉత్సవ మహాపూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కల్యాణం చేశారు. సాయంత్రం శ్రీరామ జననం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం, రాత్రి 7 గంటలకు గానం పేరిట సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం రామ మందిరంలో స్వామి వారి పవళింపు సేవ వైభవంగా జరిగింది.

3 నుంచి విద్యుత్ కండక్టర్ల మార్పు పనులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భీమడోలు – ఏలూరు 132 కేవీ విద్యుత్ ఫీడర్‌లో ప్రస్తుతం ఉన్న కండక్టర్ మార్పే పనులు ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో సూపరింటెండింగ్ ఇంజినీర్ ఈ.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పనులు జరిగే సమయంలో ఏలూరు వంగాయగూడెం విద్యుత్ కేంద్రానికి కానుమోలు విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఆయా రోజుల్లో సాంకేతిక లోపం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సహకరించాలని ప్రజలను కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఒన్‌టౌన్‌లో కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో కెనాల్ ఫీడరు ఏబీ స్విచ్ మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగుచెట్టు, అంబికా థియేటర్, కెనాల్ రోడ్, నవాబ్ పేట, బావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, మునిసిపల్ ఆఫీసు పరిసర ప్రాంతాలతో పాటు పవర్‌పేట, పాత బస్టాండు, గూడ్స్‌షెడ్ రోడ్డు, వసంత మహల్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

పింఛన్లు 94.14 శాతం పంపిణీ

ఏలూరు(మెట్రో): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లాలో తొలిరోజు శనివారం సాయంత్రానికి 94.14 శాతం పూర్తి చేశారు. 2,60,452 మందికి రూ.112.94 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. 2,45,183 మందికి (94.14 శాతం) రూ.106 కోట్లు అందజేశారు. మిగిలిన వారికి సోమవారం అందజేస్తామని తెలిపారు.

లైసెన్స్ లేదా.. తప్పదు జరిమానా

- ఏలూరులో అమలుకు చర్యలు
- ఎన్‌ఎంవీ చట్టాలతో జర జాగ్రత్త!

ఏలూరు టౌన్ : నూతన మోటారు వాహన చట్టాలను పటిష్టంగా అమలు చేసేందుకు ఏలూరు ట్రాఫిక్ పోలీస్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. చాలాకాలంగా ప్రజలకు మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పిస్తూ వస్తోన్న ట్రాఫిక్, శాంతిభద్రతల విభాగం పోలీస్ అధికారులు తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలుకు చర్యలు చేపట్టింది. ఏలూరు నగరంలోనూ చట్టాలను అమలు చేస్తూ.. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మోటారు సైకిళ్లపై ప్రయాణించేవారు హెల్మెట్ విధిగా ధరించాలని రవాణా, పోలీస్ అధికారులు హెచ్చరిస్తూ, అవగాహన కల్పిస్తున్నారు. ఇక రాష్ట్ర సర్కారు ఆదేశాలు మరింత కఠినంగా అమలు చేయనున్నారు.

ఎన్‌ఎంవీ చట్టాల్లో కొన్ని..

భారత ప్రభుత్వం ఇటీవల మోటారు వాహన చట్టాల్లో మార్పులు చేస్తూ నూతన చట్టాలను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టాల మేరకు నిబంధనలు పక్కాగా అమలు చేయాలంటూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ చట్టాల్లోని కొన్ని నిబంధనలు ఇలా..



ఏలూరులో వాహన తనిఖీల్లో ట్రాఫిక్ పోలీస్ అధికారులు

- మోటారు వాహనం రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుంటే : రూ.300
- డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే : రూ.5 వేలు నుంచి రూ.10 వేలు
- వాహన ఇన్సూరెన్స్ పత్రాలు లేకుంటే : రూ.1000, రెండోసారి రూ.2 వేలు
- పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుంటే : రూ.1000
- మితిమీరిన వేగంతో డ్రైవింగ్ చేస్తే : రూ.1000
- హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే : రూ.1000
- మోటారు సైకిల్‌పై ముగ్గురు ప్రయాణిస్తే : రూ.1000
- రోడ్లపై రాంగ్ పార్కింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ : రూ.1000
- ప్రమాదకరమైన డ్రైవింగ్‌కు : రూ.5 వేలు
- శబ్దకాలుష్యం చేస్తూ డ్రైవింగ్ చేస్తే : రూ.1000
- యూనిఫామ్ లేకుండా డ్రైవింగ్‌కు : ఆటోకు రూ.150, లారీకి రూ.300
- కారులో సీటు బెల్టు ధరించకపోతే : రూ.1000
- మద్యం సేవించి వాహనాలు నడిపితే : 10 వేలు, జైలు శిక్ష (న్యాయమూర్తి ఆదేశాల మేరకు)

నిబంధనలు పాటించాలి



ఏలూరు నగరం ప్రజలు నూతన మోటారు వాహన చట్టాలను పాటించేందుకు పోలీసులతో సహకరించాలి. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నూతన చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఏలూరు నగరంలో ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. వాహనదారుడు లైసెన్సుతోపాటు, వాహన పత్రాలు, హెల్మెట్ ధరించటం వల్ల అనేక లాభాలు ఉన్నాయి. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో కొత్త చట్టాలను పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాం.

– లక్ష్మణబాబు, ఏలూరు ట్రాఫిక్ సీఐ

యువకుడిని రక్షించిన పోలీస్



యువకుడిని తల్లికి అప్పగిస్తున్న సీఐ సత్యనారాయణ

ఏలూరు టౌన్ : ఏలూరు చాటపర్రు గ్రామానికి చెందిన జాలాది సుధీర్ ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ ప్రైవేటుగా చదువుతున్నాడు. వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్థానికి గురై ఆత్మహత్యకు పాల్పడేందుకు శుక్రవారం అర్ధరాత్రి ప్రయత్నించాడు. విషయం గ్రహించిన తల్లిదండ్రులు జయరాజు, స్వప్న ఏలూరు వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన సీఐ సత్యనారాయణ రాత్రివేళ గాలింపు చర్యలు చేపట్టి సుధీర్‌ను అదుపులోకి తీసుకుని, కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులకు అప్పగించారు. వారు పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణత్యాగం



అమర వీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎంతో మంది మాదిగల ప్రాణత్యాగంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ తెలిపారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక కంద్రిగ గూడెంలో శనివారం 300 మంది పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యాలయంలో మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలని రమేష్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం సురేంద్ర మాదిగ, మహేష్ మాదిగ, భారతి మాదిగ, చింతాటి రాజేంద్ర మాదిగ వంటి ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఎమ్మార్పీ సీనియర్ నేత బయ్యారపు రాజేశ్వరరావు మాట్లాడుతూ 31 ఏళ్ల ఉద్యమంలో ఎంతోమంది అమరులయ్యారని వివరించారు. దళిత నాయకులు మున్నుల జాన్ గుర్నాథ్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఈదుముడిలో 1994లో 18 మందితో ఎమ్మార్పీఎస్‌ను మంద కృష్ణ మాదిగ స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాశీ కృష్ణ, ఎంఈఎఫ్ నాయకులు పాల్‌రాజ్, ఎమ్మార్పీఎస్, దళిత, దళిత సేన, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెంకు చెందిన సాయిదుర్గకు తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటకు చెందిన కొడమంచిలి జాన్‌రత్నంతో 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వివాహ సమయంలో రూ.5 లక్షల కట్నం, 1 కాసు బంగారం ఉంగరం, మూడున్నర కాసుల చైన్, రూ.4 లక్షలు విలువైన సారె సామగ్రి, 2సెంట్ల ఇటి స్థలం కట్నంగా ఇచ్చారు. అధిక కట్నం తీసుకోసం సాయిదుర్గను భర్త జాన్ రత్నం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అతనికి కుటుంబ సభ్యులు సహకారం అందిస్తున్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 25న అధిక కట్నం తీసుకురావాలని సాయిదుర్గతో జాన్‌రత్నం గొడవపడి, కొట్టి గాయపర్చాడు. దీంతో సాయిదుర్గ ఫోన్ చేయగా, తన తమ్ముడు సువర్ణరాజు వచ్చి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేయించాడు. ఈ ఘటనపై పెద్దల్లో పెట్టినప్పటికీ జాన్‌రత్నం తీరు మారకపోవడంతో శనివారం సాయిదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కార్మికులపై తేనెటీగల దాడి



చికిత్స పొందుతున్న వ్యక్తి

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు 902 కొండ ప్రాంతంలో నలుగురిపై తేనెటీగలు దాడి చేశాయి. శనివారం విధులకు వెళుతున్న నలుగురు కార్మికులపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. సహచరులు వెంటనే గుర్తించి పోలవరం వైద్యశాలకు తరలించారు. వైద్యాధికారి కృష్ణంరాజు వీరికి చికిత్స అందించారు. ఒకరిని మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు.

ఇసుక తిన్నెలపై చెత్త తొలగింపు

పోలవరం రూరల్: పట్టిసం ఇసుక తిన్నెలపై పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించే పనులు చేపట్టారు. మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా వచ్చిన భక్తులు ఇసుక తిన్నెలపై పారవేసిన చెత్తను శుభ్రం చేస్తున్నారు. చెత్తను పోగు చేసి గోతులు తీసి వాటిలో ఖననం చేస్తున్నారు. ఇసుక తిన్నెలపై ఉన్న మొత్తం చెత్తను తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి టి.విజయకుమారి తెలిపారు.

పారదర్శకంగా ‘పది’ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 17 నుంచి 31 వరకు 10వ తరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేయాలని పరీక్షల ఏలూరు జిల్లా పరిశీలకుడు, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి కోరారు. ఈ పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, కస్టోడియన్లకు శనివారం స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ పరీక్షల నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎల్ శ్రీకాంత్, జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీఏ, డీఏలు ఇవ్వాలి

పదో తరగతి పరీక్షల నిర్వహణకు నియమితులైన సిబ్బందికి టీఏ, డీఏలు వెంటనే ఇవ్వాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు పరీక్షల జిల్లా పరిశీలకుడు ఎంవీ కృష్ణారెడ్డిను కలిసి మూడేళ్లుగా పది పరీక్షల విధులు నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లకు టీఏ, డీఏలు విడుదల చేయలేదని వివరించారు. జవాబుపత్రాల ప్యాకేజీ నిమిత్తం ఇచ్చే కంటింజెన్స్ కూడా ఇవ్వడంలేదని, దానికి సంబంధించిన ఖర్చు చీఫ్ సూపరింటెండ్‌లు భరించాల్సి వస్తోందని చెప్పారు. ఈ ఏడాది పాత బకాయిలతో పాటు ప్రస్తుత సంవత్సర కంటింజెన్స్ కూడా విడుదల చేయాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని కృష్ణారెడ్డి హామీ ఇచ్చారని వెంకటేశ్వరరావు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి

సమాజాభివృద్ధిలో మహిళ పాత్ర కీలకం



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎస్పీ, డీఎస్పీ

ఏలూరు టౌన్: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, విద్య, ఉద్యోగం, పారిశ్రామిక రంగాల్లోనూ మహిళలు గణనీయమైన అభివృద్ధిని సాధిస్తూ తమ సత్తాను చాటుకుంటున్నారని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వారోత్సవాల్లో భాగంగా ఏలూరులో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎస్పీ కె.ప్రతాప శివ కిషోర్ ఆధ్వర్యంలో అమీనాపేట సురేష్‌చంద్రబహుగుణ పోలీస్ స్కూల్ విద్యార్థులు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథి ఏఎస్పీ మాట్లాడుతూ మహిళల హక్కులు సాధించిన విజయాలు, సమానత్వం తదితర అంశాలపై మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ సమాజంలో మహిళాభ్యున్నతికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, టూటౌన్ ఎస్సై నాగ కళ్యాణి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

స్కూల్ గ్రేడ్ తగ్గింపుపై నిరసన

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు ఎంపీయూపీ స్కూల్‌ను ఎంపీపీ స్కూల్‌గా చేసే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్కూల్ వద్ద గ్రామస్తులు శనివారం ధర్నా చేశారు. తమ స్కూల్ ఇప్పటికే హైస్కూల్ స్థాయికి చేరాల్సి ఉన్నప్పటికీ మరింత దిగువ స్థాయికి చేర్చుతూ ప్రభుత్వం ప్రకటన చేయడం అన్యాయమని ఆరోపించారు. వంద మందికి పైగా విద్యార్థులు ఎనిమిదో తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. దిప్పకాయలపాడు సహా సమీపంలోని పంచాయతీ పరిధిలో ఉన్న గొల్లగూడెం, కిచ్చప్పగూడెం, దళితవాడ నుంచి విద్యార్థులు దాదాపు ఐదు కిలో మీటర్ల దూరం నుంచి వస్తున్నారని వివరించారు. ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను కన్నాపురం హైస్కూల్లో విలీనం చేస్తున్నట్లుగా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడం అన్యాయమని తెలిపారు. కేవలం క్రీడా ప్రాంగణం లేకపోవడాన్ని సాకుగా చూపుతూ విద్యార్థుల భవితవ్యాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీ గ్రేడ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు చేపట్టిన ఆందోళనకు రైతు నాయకులు కాకర్ల నంది, కాకర్ల శేషు, జి.రామ్మోహన్‌రావు, డి.బాబీ, గద్దె బాబు మద్దతు తెలిపారు.



ఎంపీయూపీ స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

దగాకోరు బడ్జెట్





మన్నవ కృష్ణ చైతన్య బద్దా వెంకట్రావు

ఏలూరు (టూటౌన్): ఆర్థిక మంత్రి శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ దగాకోరుగా ఉందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సూపర్ సిక్స్‌తో పాటు, మహిళలు, నిరుద్యోగులు, యువత, రైతాంగంతో పాటు అన్ని వర్గాలను విస్మరించి మోసం చేశారని మండిపడ్డారు. బడ్జెట్లో కౌలు రైతుల ఊసే లేదని, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. నిరుద్యోగ భృతికి బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు అరకొర కేటాయించి, ఎప్పటి నుంచి అమలు చేస్తారో నిర్దిష్టంగా ప్రకటించలేదని ఆరోపించారు. మహిళలకు ప్రతి నెలా రూ.1500 పంపిణీకి నిధులు, ఉచిత బస్సు పథకం ప్రస్తావనే లేదని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసంపై నిర్లక్ష్యాన్ని మరోసారి ప్రదర్శించిందన్నారు. చంద్రబాబు కపట వైఖరి తేటతెల్లం చేస్తుందని కృష్ణ చైతన్య ఆరోపించారు.

సంక్షేమాన్ని విస్మరించారు

బడ్జెట్ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి కేటాయింపులు లేవని ఇఫ్టూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు ఆరోపించారు. కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు తీసుకున్న చర్యలు శూన్యమన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న హమాలీలు, జట్టు కూలీలు, మార్కెట్ హమాలీలు వంటి వారి సంక్షేమానికి కేటాయింపులు చూపలేదని తెలిపారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి మరిన్ని కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	30	బీన్స్ చిక్కుడు	60
వంకాయలు (తెలుపు)	24	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	80
కాకర కాయలు	32	బీట్‌రూట్	32
బీరకాయలు (పందిరి)	44	కీరా దోస	40
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	34	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10–12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	20–36	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	05
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	04
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	10
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	05
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	06
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	07
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	12
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు – తిరుపతి	16.00	4830	32
బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.40	98517	33
బీహెచ్‌ఈఎల్	20.10	98503	33

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



శ్రీధర్‌ను కలిసిన జయప్రకాష్, గుడిదేశి, నేతలు



శ్రీధర్‌తో నాగేశ్వరరావు, జేపీ, నాయకులు

ఏలూరు టౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఆయన్ని పార్టీ ఏలూరు అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్‌తోపాటు పార్టీ నేతలు మాజీ ఎంపీని కలిసి జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజలంతా తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి, నేడు డబ్బులు లేవంటూ మోసం చేయటం దారుణమని అన్నారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి సరైన రీతిలో బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవులు, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ నగర అధ్యక్షులు కిలాడి దుర్గారావు తదితరులు ఉన్నారు.